సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 27 । మే । 2024



బోనస్ కొందరికేనా..?
సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇస్తామని చెప్పడంతో దొడ్డు రకాలు పండించే రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో



.. లైసెన్స్ తప్పనిసరి
మిరప నారు విక్రయించే నర్సరీల యజమానులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 41° / 29°
జిల్లాలో సోమవారం ఉదయం నుంచే ఎండ ప్రారంభమై మధ్యాహ్నానికి పెరుగుతుంది. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉంటుంది.

చంద్రుగొండలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



ఇల్లెందు సింగరేణి హైస్కూల్‌కు చేరుకున్న పోలింగ్ సిబ్బంది



కొత్తగూడెంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సామగ్రితో తరలివెళ్తున్న పోలింగ్ సిబ్బంది



న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన
భద్రగిరిలో భక్తుల రద్దీ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం వైభవంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. ఆ తర్వాత స్వామివారి ఉత్సవ మూర్తులను చిత్రకూట మండపానికి తీసుకొచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, ఈ వేడుకలో 115 జంటలు పాల్గొనడం విశేషం.

పోటెత్తిన భక్తులు..
వేసవి సెలవులకు తోడు ఆదివారం ఇతర కార్యాలయాలకు కూడా సెలవు కావడంతో భక్తులు భారీగా పోటెత్తి రామయ్యను దర్శించుకున్నారు. భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం శ్రీరామ నామస్మరణలతో మార్మోగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి వారి దర్శనానికి బారులుదీరారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆదివారం అర్చకులు విశేష పూజలు చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, ఒడి బియ్యం, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఈఓ సుదర్శన్ ఏర్పాట్లు చేశారు. కాగా, అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పాల్వంచలోని గట్టాయిగూడేనికి చెందిన దుర్గాప్రసాద్ – శిరీష దంపతులు రూ.5,016 విరాళంగా అందజేశారు.

వైద్యుల సూచనలు పాటించాలి

భద్రాచలంటౌన్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల బారి నుంచి బయటపడేందుకు ప్రతీ ఒక్కరు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనుల్లో చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరికైనా షుగర్, బీపీ ఉంటే ఆశ వర్కర్, ఏఎన్‌ఎంల వద్ద పేరు నమోదు చేయించుకోవాలని, పీహెచ్‌సీల్లో అందించే మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. జ్వరం వస్తే వెంటనే రక్త పరీక్ష చేయించుకుని వైద్యుల సలహా మేరకు మందులు వేసుకోవాలని పేర్కొన్నారు. కేన్సర్, ఇతర జబ్బుల నివారణకు 'ఈ సంజీవని' ద్వారా నిపుణులైన వైద్యుల సలహాలు పాటించాలని తెలిపారు. నాలుగు వారాలకు మించి దగ్గు, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, తరచూ జ్వరం వస్తే కళ్లె పరీక్ష చేయించుకోవాలని, క్షయ అని నిర్ధారణ అయితే పూర్తి చికిత్స పొందాలని వివరించారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్



పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

సుజాతనగర్: స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఐఐటీల్లో బీటెక్ ప్రవేశాల కోసం రెండు విడతల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తం 130 మంది విద్యార్థులకు గాను 126 మంది హాజరయ్యారని, రెండు సెషన్లలో కలిపి 8 మంది గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

పోలింగ్‌కు రెడీ..

నేడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక
- ఉమ్మడి జిల్లాలో 173 పోలింగ్ కేంద్రాలు
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి తరలిన ఉద్యోగులు
- ఓటుహక్కు వినియోగించుకోనున్న 1,23,985 మంది పట్టభద్రులు



ఖమ్మంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద వివరాలు పరిశీలిస్తున్న పోలింగ్ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, ఖమ్మం : నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నికకు అంతా సిద్ధమైంది. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1,23,985 మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల, కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ల సెంటర్ల నుంచి ఉద్యోగులు ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. ఈ మేరకు సామగ్రి పంపిణీని కలెక్టర్లు వీ.పీ.గౌతమ్, ప్రియాంక ఆల పరిశీలించి పోలింగ్ సాఫీగా జరిగేలా ఉద్యోగులకు సూచనలు చేశారు.

ఏర్పాట్లు పూర్తి..
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, ఉమ్మడి జిల్లాలో 173 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు ఖమ్మం జిల్లాలో 142 మంది చొప్పున ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 284 మంది అదర్ పోలింగ్ ఆఫీసర్లు విధులు నిర్వర్తిస్తారు. అలాగే, భద్రాద్రి జిల్లాలో పీఓ, ఏపీఓలు 55 మంది చొప్పున, ఓపీఓలు 110 మందిని కేటాయించారు. రెండు జిల్లాల్లో కలిపి రిజర్వ్‌తో సహా 199 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. ఎన్నికను 25 మంది సెక్టార్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారు. పోలింగ్ ఉద్యోగులకు ఇప్పటికే మొదటి విడత శిక్షణ పూర్తి కాగా.. రెండో విడత శిక్షణ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద ఆదివారం ఇచ్చారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి..
పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఆదివారం తమకు కేటాయించిన కేంద్రాలకు బయలుదేరారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల, కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటుచేయగా సామగ్రి తీసుకున్న ఉద్యోగులు బస్సుల్లో కేంద్రాలకు వెళ్లారు. కాగా, సామగ్రి తరలించిన వాహనాలతో పాటు సెక్టార్ ఆఫీసర్లకు కేటాయించిన వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్‌ను అమర్చారు. పోలింగ్ ముగిశాక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బ్యాలెట్ బాక్సులను తొలుత ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలకు చేర్చి ఆ తర్వాత నల్లగొండలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించనున్నారు.

1,23,985 మంది ఓటర్లు..
పట్టభద్రుల ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,23,985 మంది ఓటర్లు ఉన్నారు. వీరిని పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చి ఓటు వేయించేలా అభ్యర్థులు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. పట్టభద్ర ఓటర్లు పరిమిత సంఖ్యలోనే ఉండటంతో ఓటరు జాబితాల ద్వారా అభ్యర్థులు, వారి అనుయాయులు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి మరీ అభ్యర్థించారు. ఖమ్మం, ఖమ్మం రూరల్, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు తదితర ప్రాంతాల్లో పట్టభద్ర ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాలపై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.

ఎన్నికల ఉద్యోగులు

	ఖమ్మం జిల్లా	భద్రాద్రి జిల్లా
పీఓలు	142 మంది	65 మంది
ఏపీఓ	142 మంది	65 మంది
అదర్ పోలింగ్ ఆఫీసర్లు	284 మంది	152 మంది
సెక్టార్ ఆఫీసర్లు	15 మంది	10 మంది
బ్యాలెట్ బాక్స్‌లు	140	55

ఓటర్లు

	ఖమ్మం జిల్లా	భద్రాద్రి జిల్లా
పురుషులు	50,676	22,590
మహిళలు	33,199	17,516
ఇతరులు	04	00

మొత్తం పోలింగ్ స్టేషన్లు	ఖమ్మం	భద్రాద్రి కొత్తగూడెం	బరిలో ఉన్న అభ్యర్థులు
173	118	55	52 మంది

విధులు సమర్థవంతంగా నిర్వర్తించండి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల



ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెం రూరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల విధులను ఉద్యోగులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల సూచించారు. కొత్తగూడెంలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల మైదానంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉదయం 8 నుండి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుండగా, ఉదయం 7 : 30 గంటలకల్లా ఏజెంట్ల సమక్షాన బ్యాలెట్ బాక్సులకు సీల్ వేయాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందించాలని, చెక్‌లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి అందిందా లేదా సరిచూసుకోవాలని సూచించారు. వర్ష సూచన ఉన్నందున సకాలంలో పోలింగ్ కేందాలకు చేరుకోవాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం రిసెప్షన్ సెంటర్ కూడా ఇక్కడే ఉంటుందని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా 252 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని, సోమవారం జరిగే శాసన మండలి ఉప ఎన్నికల పోలింగ్‌లో వంద శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు మధు, దామోదర్‌రావు, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, డీటీ అంజద్ పాషా, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దారా ప్రసాద్, రంగాప్రసాద్, ఎస్‌ఐసీ సుశీల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

400 మంది పోలీసులతో భద్రత
కొత్తగూడెంటౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా జిల్లాలోని 55 పోలింగ్ కేంద్రాల వద్ద 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. ప్రతీ ఓటరు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా భద్రత కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ఎన్నిక సాఫీగా జరిగేలా అన్ని పార్టీల నాయకుల సహకరించాలని కోరారు.

ఓటు సద్వినియోగం చేసుకోండి
సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సీఎండీ ఎన్.బలరామ్ సూచించారు. ఖమ్మం – నల్లగొండ – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సోమవారం జరగనుండగా సీఎండీ ఓ ప్రకటన విడుదల చేశారు. ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరు విధిగా ఓటు వేయాలని కోరారు. ఈ విషయంలో ఏరియాల జనరల్ మేనేజర్లు చొరవ తీసుకోవాలని సూచించారు.

ఓటు ఎలా వేయాలంటే..
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సాధారణ ఎన్నికలతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. సాధారణ ఎన్నికల్లో అభ్యర్థులకు గుర్తులు, ఓటు వేసేందుకు ఈవీఎం యంత్రాలు ఉంటాయి. వీటిపై అభ్యర్థి పేరుతోపాటు గుర్తు కూడా ఉండడంతో ఓటు వేయడం సులభంగా ఉంటుంది. కానీ పట్టభద్రుల ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ విధానం అమలవుతుండగా, పేపర్‌పై అభ్యర్థుల పేరు మాత్రమే ఉంటుంది. పోలింగ్ బూత్‌లో అధికారులు ఇచ్చే పెన్నుతోనే మనకు నచ్చిన అభ్యర్థి ఫొటో పక్కన ప్రాధాన్యత క్రమంలో నంబర్ వేయాల్సి ఉంటుంది. మొదటి ప్రాధాన్యత ఓటు మాత్రం తప్పకుండా వేయాల్సి ఉండగా.. ఆపై ఎందరికి వేసినా పరిగణనలోకి తీసుకుంటారు.

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న ఇన్‌చార్జ్ జడ్జి

భద్రాచలం కోర్టులో సన్మానం



ఇన్‌చార్జ్ జడ్జిని సన్మానిస్తున్న బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు

దుమ్ముగూడెం/భద్రాచలంఅర్బన్ : పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారిని జిల్లా ఇన్‌చార్జ్ జడ్జి మార్గాని శ్రీనివాసరావు కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన భద్రాచలం కోర్టును సందర్శించారు. 2008 – 11 మధ్య కాలంలో ఆయన భద్రాచలం కోర్టు న్యాయవాదిగా పనిచేయగా, నాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు చైతన్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి, వైస్ ప్రెసిడెంట్ రమణ, జాయింట్ సెక్రటరీ విద్యాధరి, లైబ్రరీ కార్యదర్శి పేరాల వెంకటేశ్వర్లు, న్యాయవాదులు నండూరి శ్రీనివాస్, కొడాలి శ్రీనివాస్, జయరాజ్, సత్యనారాయణ, పామరాజు తిరమలరావు, బండారు అరుణ్, రమాదేవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'మావోయిస్టుల చర్యలతో ప్రజలకు నష్టం'

చర్ల : మావోయిస్టుల ఆటవిక చర్యలతో ఆదివాసీలు, సామాన్య మానవులు నష్టపోతున్నారని ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దున గల భీమారం సమీప అటవీ ప్రాంతంలో వారు అమర్చిన బాబీ ట్రూప్‌లతో ఇద్దరు ఆదివాసీ మహిళల కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. పూసుగుప్ప అటవీ ప్రాంతంలోనూ బాబీట్రూప్‌లతో మూడు ఆవులు, రెండు కుక్కలు మరణించాయని, వారి చర్యలతో అటవీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. తాము చేపట్టిన 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమానికి ఆకర్షితులై ఈ ఏడాది ఇప్పటివరకు 15 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. వారిలో ఇద్దరు డిప్యూటీ కమాండర్లు, ముగ్గురు ఏరియా కమిటీ సభ్యులు, ఐదుగురు దళసభ్యులు, ఐదుగురు మిలీషియా సభ్యులు ఉన్నారని, వారికి ప్రభుత్వం తరఫున అన్ని రకాల ప్రతిఫలాలు అందిస్తామని వివరించారు.

దమ్మపేట వాసికి జ్యోతిష్య కేసరి అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయమారుతి శర్మ

దమ్మపేట: మండల కేంద్రానికి చెందిన జ్యోతిష్య పండితులు కామవరపు విజయమారుతి శర్మకు జ్యోతిష్య కేసరి అవార్డు లభించింది. హైదరాబాద్‌లో ఆదివారం సూర్యచంద్ర కల్చరల్, సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఆయనకు మాజీ స్పీకర్ మధుసూదనాచారి అవార్డు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి బూర్గుల మధుసూదన్, సుప్రీంకోర్టు న్యాయవాది పద్మాచారి పాల్గొన్నారు.

తేలని 'పంచాయితీ'

- ఒకటా.. మూడా.. అనేది సస్పెన్స్
- ఏ విషయం ప్రకటించని ప్రభుత్వం
- త్వరలో ఎన్నికలనే చర్చతో మళ్లీ తెరపైకి భద్రాచలం
- ఆసక్తిగా ఎదురు చూస్తున్న స్థానికులు



భద్రాచలం వ్యూ

భద్రాచలం: భద్రాచలం గ్రామపంచాయతీ ఒకటిగా కొనసాగుతుందా.. లేక మూడు పంచాయతీలుగా విడిపోతుందా అనే సస్పెన్స్‌కు తెరపడటం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా దీనిపై ఉత్కంఠ వీడలేదు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో ఇక స్థానిక ఎన్నికలే తరువాయి అనే చర్చ నడుస్తోంది. దీంతో పంచాయతీ ఎన్నికలు జరిగితే భద్రాచలం, సారపాకపై ప్రభుత్వం తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రెండు గ్రామాల ప్రజలు ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఆరేళ్లు పాలకవర్గం లేకుండానే..
80 వేలకు పైగా జనాభా ఉన్న భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ జాబితాలో ఉంది. ఇక్కడ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉండగానే 2013లో పాలకవర్గ ఎన్నికలు జరిగాయి. దీని పదవీ కాలం 2018 ఆగస్టులో ముగిసింది. ఇక గత ఆరేళ్లుగా పాలకవర్గం లేకుండా అధికారుల ఆధ్వర్యంలోనే భద్రాచలం గ్రామపంచాయతీ నిర్వహణ కొనసాగుతోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో భద్రాచలంతో పాటు సారపాకను మున్సిపాలిటీగా ప్రకటించింది. దీనిపై ఆదివాసీ సంఘం నాయకులు హైకోర్టును ఆశ్రయించగా, తక్షణమే పంచాయతీ పాలకవర్గం ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో స్పందించిన నాటి ప్రభుత్వం భద్రాచలాన్ని మూడు, సారపాకను రెండు పంచాయతీలుగా విభజిస్తూ జీఓ నం.45ను విడుదల చేసింది. ఈ జీఓ ప్రకారం భద్రాచలాన్ని భద్రాచలం, సీతారాంనగర్, శాంతినగర్ పంచాయతీలుగా, సారపాకను సారపాక, ఐటీసీ పంచాయతీలుగా విభజించారు. భద్రాచలంలో 21 వార్డులు, సీతారాంనగర్‌లో 17 వార్డులు, శాంతినగర్‌లో 17 వార్డులుగా, సారపాక పంచాయతీలో 17 వార్డులు, ఐటీసీ పంచాయతీలో 15 వార్డులుగా ప్రకటించి ఎన్నికలను నిర్వహిస్తామని హైకోర్టుకు సర్కారు నివేదించింది. అయితే ఈ జీఓను స్థానికులతో పాటు పలు పార్టీలు, కొన్ని ఆదివాసీ సంఘాలు వ్యతిరేకించాయి. ఈ జీఓను రద్దు చేసి మేజర్ గ్రామపంచాయతీగా కొనసాగించాలంటూ నాటి భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య గవర్నర్, సీఎంతో పాటు పంచాయతీరాజ్ మంత్రికి వినతిపత్రం అందజేశారు. దీంతో మంత్రివర్గం ఆమోదించిన బిల్లును గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. మళ్లీ రెండోసారి పంచాయతీ రాజ్ చట్ట సవరణ చేసి గవర్నర్ వద్దకు పంపినా.. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటుగా తమిళిసై కూడా గవర్నర్ పదవికి రాజీనామా చేసి వెళ్లిపోయారు.

ప్రభుత్వ నిర్ణయం ఏమిటో..
కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఈ 'పంచాయితీ'పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇక పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో త్వరలోనే స్థానిక పోరు జరుగుతుందనే ప్రచారం నేపథ్యంలో ఈ గ్రామపంచాయతీలపై మళ్లీ చర్చ నడుస్తోంది. ఆరేళ్లుగా పాలకవర్గం లేకపోవడంతో స్థానిక నాయకులు పదవులపై పలు ఆశలు పెట్టుకున్నారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలానికి దేశ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, దీన్ని మూడు పంచాయతీలుగా విభజించవద్దని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర విభజన సమయంలో ఐదు పంచాయతీలను ఏపీలో కలపడంతో భద్రాచలం తీవ్రంగా నష్టపోయిందని, మళ్లీ ఇప్పుడు మూడు ముక్కలు చేసి మరింత నష్టం కలిగించవద్దని ఎక్కువ మంది కోరుతున్నారు. కొన్ని ఆదివాసీ సంఘాలు మాత్రం మూడు పంచాయతీలుగా విభజించాలని కోరుతున్నాయి. దీంతో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ప్రజల ఆమోదానికే కట్టుబడి ఉంటా



భద్రాచలానికి చెందిన మెజార్టీ ప్రజలు తీసుకునే నిర్ణయం మేరకే ప్రభుత్వానికి నా వాదన వినిపిస్తా. పాలకవర్గం ఎన్నికలు లేక భద్రాచలంలో అభివృద్ధి కుంటుపడింది. దేశవ్యాప్తంగా పేరుగాంచిన పుణ్యక్షేత్రమైన భద్రాచలం పేరుకు, పట్టణానికి ఎలాంటి నష్టం కలగకుండా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విన్నవిస్తా.

– తెల్లం వెంకట్రావ్, భద్రాచలం ఎమ్మెల్యే

క్లుప్తంగా

ఓసీ-4లో సీఎస్పీ పునఃప్రారంభం



సీఎస్పీని ప్రారంభిస్తున్న పీఓ లక్ష్మీపతిగౌడ్

మణుగూరు రూరల్ : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకే ఓసీ-4 గనిలో కోల్ స్టోరేజ్ ప్లాంట్(సీఎస్పీ)ను ఆదివారం పీకేఓసీ ప్రాజెక్ట్ అధికారి టి.లక్ష్మీపతిగౌడ్ ప్రారంభించారు. పదేళ్ల క్రితం మరమ్మతులకు గురైన ప్లాంట్‌ను.. ఎట్టకేలకు మరమ్మతులు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చారు. దీంతో బొగ్గు సరఫరా వేగవంతమవుతుందని పీఓ తెలిపారు. గని మేనేజర్ దండమూడి రాంబాబు, అధికారులు రమణారెడ్డి, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యాంపై నుంచి జలాశయాన్ని, పర్యావరణ కేంద్రంలోని బొమ్మలను ఆసక్తిగా తిలకించారు. 850 మంది కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.28,770, 400 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.20,010 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి



మృతి చెందిన పాడిగేదెలు

చండ్రుగొండ : మండలంలోని తిప్పనపల్లి పంచాయతీ మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన మూడు పాడిగేదెలు ఆదివారం మృత్యువాతపడ్డాయి. మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన ఎస్కే ఖైరుల్లాకు చెందిన రెండు, కరీంకు చెందిన ఒక గేదె ఉదయం గ్రామశివారులో మేతకు వెళ్లాయి. తెగిపడి ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. రూ. 2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తమకు పరిహారం ఇవ్వాలని బాధితరైతులు కోరుతున్నారు.

నాలుగు ఆవులు..



విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవులు

దుమ్ముగూడెం : మండలంలోని తూరుబాక గ్రామ శివారులో శనివారం తెగిపడిన విద్యుత్ తీగలను తాకి విద్యుదాఘాతానికి గురై నాలుగు ఆవులు మృతి చెందాయి. శనివారం సాయంత్రం వచ్చిన గాలిదుమారానికి విద్యుత్ తీగలు తెగి కింద పడటంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో పాతబండారుగూడెం గ్రామానికి చెందిన బాధిత రైతులు కాక అదెయ్య, కాక పోతయ్య, కుంజ భద్రయ్య, వర్సా అర్జయ్య ఆవేదన చెందుతున్నారు. కాగా బాధిత రైతులను ఆదుకోవాలని, విద్యుత్‌శాఖ రూ.4 లక్షలు పరిహారం చెల్లించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్ కోరారు.

కాలం చెల్లిన కూల్ డ్రింక్‌ల విక్రయం



సీసాపై ఉన్న గడువు తేదీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఏజెన్సీలు కాలం చెల్లిన కూల్ డ్రింక్‌లను సరఫరా చేస్తున్నాయి. పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో ఉన్న ఓ కిరాణా దుకాణంలో కస్టమర్ కూల్‌డ్రింగ్ కొనుగోలు చేసి తాగాడు. తాగిన వెంటనే కొంత ఇబ్బందిగా అనిపించడంతో కూల్ డ్రింక్ సీసాపై గడువు తేదీ పరిశీలించాడు. ఎక్స్‌పైరీ తేదీ మార్చి 23వ తేదీనే ముగిసినట్లు ఉండగా, షాపు యజమానిని ప్రశ్నించాడు. తాను పరిశీలించలేదని, రెండు రోజుల క్రితమే ఏజెన్సీ నుంచి కూల్ డ్రింక్‌లకు కొనుగోలు చేశామని సమాధానం ఇచ్చాడు. సంబంధిత అధికారులు స్పందించి కాలం చెల్లిన కూల్ డ్రింక్‌లను సరఫరా చేస్తున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

బోనస్ కొందరికేనా..?

- సన్నరకం ధాన్యానికే ప్రకటించిన ప్రభుత్వం
- వచ్చే వానాకాలం నుంచి క్వింటాల్‌కు రూ.500
- నిరాశ చెందుతున్న దొడ్డు రకం సాగు రైతులు
- ఈసారి ఖరీఫ్‌లో తగ్గనున్న దొడ్డు రకం వరిసాగు





నూర్పిడి చేస్తున్న ధాన్యం(ఇన్‌సెట్) వరిసాగు

పాల్వంచరూరల్: సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో దొడ్డురకం ధాన్యం రైతులు ఆందోళన చెందుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వరి (సన్నరకం) ధాన్యానికి బోనస్ ఇచ్చేందుకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దీంతో సన్నరకం ధాన్యం సాగు చేసే రైతులు హర్షం వ్యక్తం చేస్తుండగా దొడ్డు రకం సాగు చేసే రైతులు మాత్రం నిరాశ చెందుతున్నారు.

జిల్లాలో వరిసాగు ఇలా..

జిల్లాలో రైతులు పండించే పంటల్లో వరిసాగే అధికంగా ఉంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం వానాకాలంలో 1,61,157 ఎకరాలు, యాసంగిలో 36,867 ఎకరాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కాగా యాసంగిలో అంచనాకు మించి 59,753 ఎకరాల్లో సాగుచేశారు. సన్నరకం ధాన్యాన్ని లక్షా ఎకరాల్లో సాగు చేస్తుండగా, దొడ్డు రకం ధాన్యాన్ని 61 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అధికశాతం సన్నరకం వడ్లను వానాకాలంలోనే రైతులు సాగు చేస్తున్నారు. వేసవిలో మాత్రం దొడ్డు రకం సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు.

సన్నరకాలు ప్రైవేట్ వ్యాపారులకే..

సన్నరకం ధాన్యం పండించే రైతులు అధికశాతం ప్రైవేట్ వ్యాపారులకే విక్రయిస్తున్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ఆసక్తి చూపడంలేదు. కానీ ప్రభుత్వం సన్న రకాలకే బోనస్ ప్రకటించింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే ముందుగా ధాన్యాన్ని ఆరబెట్టాలని, మట్టిపెళ్లలు ఉండొద్దని నిబంధనలు విధిస్తున్నారు. అదే ప్రైవేట్ వ్యాపారులు పచ్చి వడ్లను ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేస్తుండగా, రైతులు వారికే విక్రయిస్తున్నారు. దొడ్డు రకం ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులు సగం ధరలకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆ ధాన్యం పండించిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. కానీ ప్రభుత్వం నిర్ణయంతో వారికి బోనస్ అందే పరిస్థితి లేదు. సన్నరకం ధాన్యానికే బోనస్ ప్రకటించడంతో రైతులు ఈ వానాకాలంలో దొడ్డు రకం సాగు తగ్గించే అవకాశం ఉంది.

దొడ్డు రకం ద్వారానే అధిక దిగుబడి

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సన్న రకం సాగు చేస్తున్నా దొడ్డు రకం వరిసాగుతోనే అధిక దిగుబడి లభిస్తుందని రైతులు చెబుతున్నారు. సన్నరకం ధాన్యం ఎకరానికి 20 బస్తాల దిగుబడి వస్తే దొడ్డురకం ధాన్యం ఎకరానికి 30 బస్తాల దిగుబడి లభిస్తుందని పేర్కొంటున్నారు. దొడ్డురకం వరి చీడపీడలను తట్టుకోవడంతోపాటు 135 రోజులకే పంట చేతికి వస్తుంది. అదే సన్న రకాలైతే 157 రోజుల తర్వాత దిగుబడి వస్తుంది. దీనికి తోడు నీటి వినియోగం కూడా తక్కువగా ఉండటంతో రైతులు దొడ్డు రకం వరి సాగుకు మొగ్గుచూపుతున్నారు.

మార్గదర్శకాలు ఇంకా రాలేదు



ప్రభుత్వం ధాన్యానికి బోనస్‌ను ప్రకటించినా ఇంతవరకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. సన్నరకానికా, దొడ్డు రకం ధాన్యానికా అనేది ఇంకా స్పష్టత లేదు. ప్రభుత్వం నుంచి విధివిధానాలు వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయి.

– బాబూరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

దొడ్డు రకానికీ బోనస్ చెల్లించాలి



ప్రభుత్వం సన్నరకాలకే బోనస్ ఇస్తామనడం సరికాదు. దొడ్డు రకం, సన్నరకం అంటూ తేడా చూపవద్దు. దొడ్డురకం పండించే రైతులకు అన్యాయం జరగకుండా పునరాలోచన చేయాలి.

– గంగుల వెంకటేశ్వరరెడ్డి, రైతు

వ్యాపారులు దొడ్డు రకం కొనరు



సన్న రకం ధాన్యం మిల్లర్లు అధికంగా కొంటారు. అదే దొడ్డు రకం కొనడంలేదు. కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాల్సి వస్తుంది. అన్ని భూముల్లో సన్న రకాలు పండవు. ప్రభుత్వం అన్ని రకాల ధాన్యాన్నికి బోనస్ ఇవ్వాలి.

– నాగిరెడ్డి, రైతు

మిరప నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి

- బహిరంగంగా మిరప, కూరగాయల నారు విక్రయిస్తే చర్యలు
- ప్రభుత్వం అనుమతించిన విత్తనాలతోనే నారు పెంచాలి
- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాధికారి జీవీ రమణ



మిరప నర్సరీ

ఖమ్మంవ్యవసాయం: మిరప పంట సాగులో నారు ఎంపికే కీలకం. ప్రస్తుతం మిర్చి పంటకు దేశ, విదేశాల్లో డిమాండ్ ఉంది. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో సాగు చేసే 'తేజా' రకం మిర్చికి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ధర పలుకుతోంది. దీంతో జిల్లాలో నీటి వనరులు ఉన్న రైతులు మిర్చి సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది మిర్చి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నట్లు ఉద్యాన శాఖ భావిస్తోంది. అయితే, ఎక్కువ మంది రైతులు నారు కొనుగోలుకు నర్సరీలను ఆశ్రయించనున్న నేపథ్యాన నర్సరీల యజమానులు పాటించాల్సిన జాగ్రత్తలపై ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి బీవీ రమణ పలు సూచనలు చేశారు.

ఈ సూచనలు పాటించాల్సిందే..

మిరప నర్సరీ యజమానులు 2017 నర్సరీ చట్టం ప్రకారం తప్పనిసరిగా లైసెన్సు పొంది ఉండాలని ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి రమణ సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలను కొనుగోలు చేసి నర్సరీల్లో పెంచాలని తెలిపారు. నర్సరీ లైసెన్సు కాలపరిమితి ముగియడానికి కనీసం 15 రోజులు ముందుగానే రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మిరప, కూరగాయ నారు పెంచి రైతులకు విక్రయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. నారు పెంపకంలో కోకోపిట్, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలపై ఉద్యాన అధికారుల సూచనలు పాటించాలని, యజమానులు తప్పనిసరిగా రిజిస్టర్లు నిర్వహిస్తూ, ఎరువుల వినియోగం, మొక్కల విక్రయం తదితర అంశాలను నమోదు చేయాలన్నారు. రైతులకు నారు విక్రయించిన సమయాన బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఇదే సమయాన రైతులు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని, అనుమతి లేని నర్సరీల్లో నారు కొని మోసపోవద్దని సూచించారు.

నర్సరీల నిర్వాహకులు సంప్రదించాల్సిన ఉద్యాన అధికారుల నంబర్లు

నియోజకవర్గం	సెల్ నంబర్
ఖమ్మం	89777 14103
పాలేరు	89777 14104
మధిర నియోజకవర్గం, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాలు	89777 14113
వైరా నియోజకవర్గం, సత్తుపల్లి, వేంసూరు మండలాలు	89777 14105

నెట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపిక పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ నెట్ బాల్ జట్ల ఎంపికకు ఆదివారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 34 మంది పురుషులు, 24 మహిళలు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చాటిన 13మంది పురుషులు, 12మంది మహిళలతో ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఫణికుమార్ తెలిపారు. ఈ జట్లకు మూడు రోజులపాటు శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు

ఏఎస్పీకి నర్సింగ్ కళాశాల యాజమాన్యం వినతి

భద్రాచలంఅర్బన్: కొన్ని సంఘాలు, సోషల్ ఆర్గనైజేషన్లు తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయంటూ మారుతి నర్సింగ్ కళాశాల యాజమాన్యం భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్‌కు వివరించింది. ఈ మేరకు ఆదివారం భద్రాచలంలో ఆయనకు వినతిపత్రం సమర్పించింది. పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న మారుతి నర్సింగ్ కళాశాల ఘటనపై వస్తున్న ఆరోపణలను కళాశాల బాధ్యులు వివరించారు. విద్యార్థిని పగిడిపల్లి కారుణ్య తీవ్ర గాయాలపాలుకాగా, భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని తెలిపారు. ప్రస్తుతం పోలీసులు అన్ని కోణాల నుంచి కేసు విచారిస్తున్నారని, కానీ సరైన ధ్రువీకరణ లేకుండా కొన్ని సోషల్ ఆర్గనైజేషన్లు విద్యార్థిని మరణానికి సంబంధించి నిరాధార, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని సంఘాల ప్రవర్తన ఉద్దేశ పూర్వకంగా కాలేజీ ప్రతిష్టను దిగజార్చేలా ఉందని విన్నవించారు. అసత్య, తప్పుడు ఆరోపణలు చేయకుండా నియంత్రించాలని కోరారు. ఏఎస్పీని కలిసిన వారిలో నర్సింగ్ కళాశాల చైర్మన్ సుబ్బరాజు, కార్యదర్శి కాంతారావు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి కళాశాల యాజమాన్యానిదే బాధ్యత

చర్ల : భద్రాచలం పట్టణంలో నర్సింగ్ విద్యార్థిని పగిడిపల్లి కారుణ్య మృతికి పూర్తి బాధ్యత కళాశాల యాజమాన్యం డాక్టర్ ఎస్ఎల్ కాంతారావుదేనని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్) భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ ఆజాద్ పేరిట ఆదివారం ఓ లేఖ విడుదల చేశారు. కారుణ్య మృతిపై న్యాయవిచారణ జరిపించి నిజాలను బయట పెట్టాలని, ఏజెన్సీలో నర్సింగ్ విద్య పేరుతో పేదల జీవితాలతో ఆడుకుంటున్న మారుతి నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

2.48 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

ప్రైవేటు బస్సు లగేజీ కేబిన్‌లో అమర్చి తరలింపు



గంజాయి తరలిస్తున్న ప్రైవేటు బస్సు

అశ్వాపురం: పుష్ప సినిమా తరహాలో ఓ ప్రైవేటు బస్సు లగేజీ కేబిన్‌లో హైదరాబాద్ తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సీతారాంపురం గ్రామంలో శనివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో చింతూరు నుంచి భద్రాచలం, అశ్వాపురం, ఏటూరునాగారం మార్గంలో హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేటు బస్సును తనిఖీ చేయగా సుమారు రూ. 66 లక్షల విలువైన 2.48 క్వింటాళ్ల గంజాయి లభ్యమైంది. గంజాయిని తరలిస్తున్న మహబూబ్‌నగర్‌కు చెందిన నరేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, భరత్‌కుమార్‌లను అరెస్ట్ చేశారు. సెల్‌ఫోన్లు, బస్సును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

టేకులపల్లిలో నాలుగు కేజీలు..

టేకులపల్లి: అక్రమంగా కారులో తరలిస్తున్న నాలుగు కిలోల గంజాయిని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్‌ఐ షేక్ సైదా రవూఫ్ కథనం ప్రకారం.. మండలంలోని గోలియాతండా సేవాలాల్ గుడి సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా, సుమారు రూ.లక్ష విలువైన నాలుగు కిలోల గంజాయి లభించింది. డొంకరాయి నుంచి కొత్తగూడెం మీదుగా జనగాం తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. పోలీసులు నిందితులు కార్తీక్, వంశీకృష్ణలను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

కాలుతున్న చెట్టు కూలిపడడంతో 12 మందికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నుంచి చర్ల మండలానికి ట్రాక్టర్‌లో వస్తున్న గిరిజనులపై కాలుతున్న ఓ చెట్టు కూలి పడడంతో 12 మందికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లా ఊసూరుకు చెందిన 20 మంది ట్రాక్టర్‌లో పూసుగుప్ప మీదుగా చర్లకు వస్తున్నారు. ఈ సమయంలో వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ ఉంజుపల్లి – వెంకటచెరువు గ్రామాల మధ్యలోకి రాగా రోడ్డు పక్కన కాలుతున్న చెట్టు అకస్మాత్తుగా కూలి ట్రాక్టర్ ట్రక్కుపై పడింది. దీంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న వారిలో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కరెంట్ సరఫరా లేక 500 కోళ్లు మృతి

కల్లూరురూరల్: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురంలోని ఒక కోళ్ల ఫారంలో విద్యుత్ కోతతో ఉక్కపోతకు గురై 500 కోళ్లు చనిపోయాయి. ఈ ఘటనతో తనకు సుమారు రూ.6 లక్షల నష్టం వాటిల్లిందని కోళ్ల ఫారం యజమాని హరిప్రసాద్‌రెడ్డి వాపోయాడు. ప్రీమాన్సూన్ పనుల్లో భాగంగా విద్యుత్ తీగలకు అడ్డుగా చెట్ల కొమ్మలు తొలగించేందుకు ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని అధికారులు ముందుగానే ప్రకటించారు. అయితే, మధ్యాహ్నం ఒంటి గంటకు బదులు సాయంత్రం 3.40 గంటలకు సరఫరా ఇచ్చారు. దీంతో ఉక్కపోతకు గురై, తాగునీరు సరఫరా లేక కోళ్లు చనిపోయినట్లు తెలుస్తోంది. అయితే, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల్లో ఆలస్యం జరగడంతోనే అనుకున్న సమయానికి సరఫరా ఇవ్వలేదని తెలుస్తోంది. ఇది కాక కోళ్ల ఫారంలో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు యజమాని జనరేటర్ సమకూర్చుకోకపోవడం ఇంకో కారణమని సమాచారం.

భద్రగిరిలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీకి చెందిన భక్తులు విరాళం అందజేశారు. విశాఖపట్నానికి చెందిన ఎస్.అనంతరావు – శ్రీలక్ష్మి దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళాన్ని అధికారులకు అందజేసి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


పోస్టాఫీస్ సెంటర్ పెట్రోల్ బంక్‌పై కేసు నమోదు



పెట్రోల్‌బంక్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా తూనికల, కొలతల అధికారి మనోహర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో ఉన్న పెట్రోల్‌బంక్‌పై జిల్లా తూనికల, కొలతల శాఖాధికారి కె.మనోహర్ ఆదివారం కేసు నమోదు చేశారు. కొనుగోలు చేసిన పెట్రోల్ కొలత తక్కువగా ఉందని వినియోగదారులు ఫిర్యాదు చేయగా, ఆయన పెట్రోల్ బంక్‌కు చేరుకుని తనిఖీ చేశారు. బంక్‌లో ఉన్న మిషన్లను, రికార్డులను పరిశీలించారు. పెట్రోల్ బంక్‌లో ఉన్న యంత్రాల్లో లోపం లేదని, సిబ్బంది చేతివాటం ప్రదర్శించడం వల్ల పెట్రోల్ పోసినపుడు తక్కువగా వస్తుందని గుర్తించారు. రీడింగ్ జీరో చేయకుండా వినియోగదారులకు పెట్రోల్ పోస్తున్నారని, దీంతో పెట్రోల్ తక్కువగా వస్తుందని గుర్తించి పోస్టాఫీస్ సెంటర్‌లోని శ్రీనివాస ఫిల్లింగ్ స్టేషన్‌పై కేసు నమోదు చేశామని మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు పెట్రోల్ పోయించుకునేప్పుడు జీరో రీడింగ్ చూసుకోవాలని సూచించారు.

పశువుల వాహనం సీజ్



పోలీసులు పట్టుకున్న పశువులు

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని జంగారెడ్డిగూడెం మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు ఏపీ వైపు నుంచి వస్తున్న బొలెరో వ్యాన్‌లో 11 ఆవులను తరలిస్తున్నట్లు గుర్తించారు. వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, ఏపీలోని అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం ఎస్.రాయవరం గ్రామానికి చెందిన వ్యాపారులు తురందాస్ వీరాశివ, చొబ్బా నర్సింగరావు తుని సంతలో ఆవులను కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని ఓ కబేళాకు తరలిస్తున్నట్లు తేలింది. వాహనాన్ని సీజ్ చేసి, పశువులను పాల్వంచలోని గో సంరక్షణ కేంద్రానికి తరలించారు. వ్యాన్ డ్రైవర్ జి.శ్రీను, వ్యాపారులు వీరాశివ, నర్సింగరావులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అలరించిన 'ఆస్తికలు' నాటిక



ఆస్తికలు నాటికలోని ఓ సన్నివేశం



నృత్యప్రదర్శన ఇచ్చిన చిన్నారులతో నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: ఆస్తులు సమకూర్చుకోవడం, డబ్బు పోగేసుకోవడమే గొప్పగా భావిస్తున్నారని చెబుతూ.. ఒక కుటుంబంలో జరిగిన ఘటనల ఇతివృత్తంతో రూపొందించిన 'ఆస్తికలు' నాటిక ఆకట్టుకుంది. నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో గంగోత్రి పెదకాకాని కళాకారుల బృందం ఈ నాటికను ప్రదర్శించింది. పిన్నమనేని మృత్యుంజయరావు రచించిన ఈ నాటికకు గతంలో బంగారు నంది అవార్డు లభించింది. ఈ సందర్భంగా నాయుడు గోపి, వీసీహెచ్‌కే ప్రసాద్, గుడివాడ లహరి, డాక్టర్ బొక్కా శ్రీనివాసరావు, ఎస్.సూర్య, పి.వరప్రసాద్ వివిధ పాత్రలు పోషించగా, పరమేశ్, రమణ, నోరి రామ్మోహన్ సహకరించారు. అనంతరం ఖమ్మంకు చెందిన రాయల్ డ్యాన్స్ అకాడమీ మాస్టర్ సంతోషిణి రెడ్డి కూచిపూడి నృత్యాలయం చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళాసాంస్కృతిక సంస్థ కార్యదర్శి ఎ.సుబ్రహ్మణ్యకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగసని రవితో పాటు కాళ్ల పాపారావు, పోలాస్ శ్రీనివాస్, బైరి హరినాథబాబు, బయ్యన్న బాబు, మోటమర్రి జగన్మోహన్‌రావు, వేముల సదానందం, నామా లక్ష్మీనారాయణ, రవీందర్ పాల్గొన్నారు.

కర్మకాండలకు వెళ్తూ కానరాని లోకాలకు..

- కిన్నెరసాని బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం
- బైక్‌ను కారు ఢీకొని యువకుడి మృతి
- మరో యువకుడి పరిస్థితి విషమం



ప్రమాదంలో దెబ్బతిన్న మోటార్‌సైకిల్, కారు

బూర్గంపాడు: బైక్‌ను కారు ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మండల పరిధిలోని పినపాక పట్టీనగర్ సమీపంలో ఉన్న కిన్నెరసాని బ్రిడ్జిపై ఆదివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ పట్టణ పరిధిలోని గుడిపూడి ఏరియాకు చెందిన శెట్టిపల్లి నర్సింహారావు(18), చర్ల మండలం దోసలపల్లి గ్రామానికి చెందిన బంధువు కణితి హర్షవర్ధన్‌తో కలిసి ఆదివారం బూర్గంపాడు మండలం కృష్ణసాగర్‌లో జరిగే మరో బంధువు కర్మకాండలకు మోటార్‌సైకిల్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో పినపాక పట్టీనగర్ సమీపంలో కిన్నెరసాని బ్రిడ్జిపై ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో నర్సింహారావుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. హర్షవర్ధన్‌కు కూడా తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కొత్తగూడెం, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో బైక్ రెండు ముక్కలుగా విడిపోయింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. మృతుడు నర్సింహారావు తండ్రి కొన్నేళ్ల క్రితం మృతిచెందటంతో బాబాయి సంరక్షణలో ఉంటున్నాడు. రద్దీగా ఉండే భద్రాచలం-పాల్వంచ రహదారిపై కిన్నెరసాని బ్రిడ్జిపై ప్రమాదం జరగటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్డుకు ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. బూర్గంపాడు, పాల్వంచ పోలీసులు ఘటనాప్రాంతానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బూర్గంపాడు సివిల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బాబాయి ఫిర్యాదు మేరకు ఎస్సై నాగభిక్షం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారును అక్కడ వదిలేసి అందులోని వారు పరారైనట్లు తెలుస్తోంది.